సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం | 20 | జూన్ | 2025



ఈ సమ్మర్ కూల్ గురూ..
వేసవి ఆరంభంలోనే ఎండలు అదరగొట్టాయి. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అందరూ భావించగా అందుకు భిన్నంగా మే నెలలో వాతావరణం చల్లబడింది. IIలో ▸



ఒత్తిడిలో యంత్రాంగం
ప్రభుత్వం యోగా మంత్రం జపిస్తుండటంతో అధికార యంత్రాంగం ఒత్తిడిలో కొట్టుమిట్టాడుతోంది. ఎన్‌రోల్‌మెంట్, పోటీలతో ఉద్యోగులు సతమతమవుతున్నారు. IIలో ▸




భర్తకు దేహశుద్ధి
కొయ్యలగూడెంలోని ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న వ్యక్తికి ఆయన భార్య దేహశుద్ధి చేసింది. తనకు న్యాయం చేయాలని ఆందోళనకు దిగింది. IIలో ▸

సచివాలయాల్లో కూటమి బదిలీలలు

స్వశక్తితో ఉద్యోగాలు సాధించి గ్రామ, వార్డుస్థాయిలో సేవలందిస్తున్న సచివాలయ ఉద్యోగులను కూటమి నేతల చెప్పుచేతల్లో పెట్టే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఉద్యోగుల బదిలీలపై స్పష్టత లేని జీఓ ఇచ్చిన కూటమి ప్రభుత్వం.. ఎన్నడూ లేనివిధంగా బదిలీల్లో రాజకీయ జోక్యానికి తెరలేపింది. ఈ మేరకు వీఐపీ (మంత్రి/ఎమ్మెల్యే/ఎంపీ) పేరిట సిఫార్సు లేఖల కోసం ప్రొఫార్మాలో ప్రత్యేక కాలమ్ ఏర్పాటుచేసింది.

సిఫార్సుల పర్వం
- ఉద్యోగులను కూటమి నేతల చెప్పుచేతల్లో పెట్టే ఎత్తుగడ
- బదిలీల నిర్వహణపై స్పష్టత లేని జీఓ
- మెరిట్‌ను పక్కనపెట్టి సిఫార్సు లేఖలున్న వారికే ప్రాధాన్యం
- ఈ మేరకు ప్రొఫార్మాలో వీఐపీ కాలమ్
- సిఫార్సు లేఖల కోసం నేతల వద్దకు ఉద్యోగుల ప్రదక్షిణలు
- చెప్పినట్టు పనిచేసే వారికే ఎమ్మెల్యేల లేఖలు
- జిల్లాలో 4,434 మంది సచివాలయ ఉద్యోగులు
- సచివాలయాల్లో పారదర్శకతకు పెద్దపీట వేసిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- రాజకీయ జోక్యానికి ఆస్కారం లేకుండా ఉద్యోగుల నియామకాలు, బదిలీలు




Transfer Proforma only of Village Surveyors

View only

సర్వేయర్ల బదిలీలకు సంబంధించిన ప్రొఫార్మాలో వీఐపీ కాలమ్

ఉద్యోగుల్లో గందరగోళం
సాధారణంగా వెబ్, ఆన్‌లైన్ కౌన్సెలింగ్, మెరిట్, ర్యాకింగ్, మ్యూచువల్ విధానంలో బదిలీలు జరుగుతుంటాయి. గత ప్రభుత్వంలో రాజకీయ జోక్యానికి తావివ్వకుండా కౌన్సెలింగ్ నిర్వహించి ర్యాంకింగ్ మేరకు పోస్టింగ్‌లు ఇచ్చేవారు. తాజా బదిలీల్లో అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఏ విధానాన్ని అనుసరించేది కూటమి ప్రభుత్వం స్పష్టం చేయకపోవడం ఉద్యోగులను గందరగోళానికి గురిచేస్తోంది. సర్వేయర్ల బదిలీలకు సంబంధించిన ప్రొఫార్మాలో వీఐపీ రికమెండేషన్స్ (మంత్రి/ ఎమ్మెల్యే/ ఎంపీ) పేరుతో ప్రత్యేక కాలమ్‌ను ఏర్పాటుచేయడం సిఫార్సు లేఖల ప్రాధాన్యతను స్పష్టం చేస్తోంది.

ఎమ్మెల్యేల వద్దకు బారులు
జిల్లాలో 393 గ్రామ, 142 వార్డు సచివాలయ పరిధిలో 4,434 మంది సచివాలయ ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో దాదాపు 70 శాతం మంది బదిలీ అవుతారని అంచనా. స్థానిక నేతలను ప్రసన్నం చేసుకోవడం ద్వారా సిఫార్సు లేఖల కోసం సచివాలయ ఉద్యోగులు కూటమి ఎమ్మెల్యేల ఇళ్లకు క్యూ కడుతున్నారు. తమ చెప్పుచేతల్లో పనిచేసే వారి పేర్లను ఎమ్మెల్యేలకు సూచించి కావాల్సిన వారికి కవరింగ్ లెటర్లు ఇప్పించే పనిలో నాయకులు ఉన్నారు. ప్రస్తుతం జిల్లాలోని ఎమ్మెల్యేల నివాసాలు సిఫార్సు లేఖల కోసం వస్తున్న సచివాలయ ఉద్యోగులతో కిటకిటలాడుతున్నాయి.

సాక్షి, భీమవరం: నెలాఖరు నాటికి సచివాలయ ఉద్యోగుల బదిలీలను పూర్తిచేసేందుకు మూడు రోజుల క్రితం ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. మే నెలాఖరవు నాటికి ఒకే చోట ఐదేళ్ల కాలం పూర్తిచేసుకున్న వారి బదిలీ తప్పనిసరి. అలాగే ఐదేళ్లు పూర్తికాకున్నా రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ కోరుకునే వారికి అవకాశం ఇచ్చారు. అభ్యర్థన బదిలీ కావాలనుకునే వారు ఈనెల 22 నుంచి 24వ తేదీలోపు రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ మాడ్యూల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలోని సొంత మండలాల్లో పనిచేసే వెసులుబాటును తొలగించింది. ఒకే చోట ఐదేళ్లుగా పనిచేస్తున్న వారి వివరాలను ఇప్పటికే ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లు సిద్ధం చేశారు. 25 నుంచి 29లోపు ప్రాధాన్యతను అనుసరించి బదిలీలు పూర్తిచేయనున్నట్టు ప్రభుత్వం తెలిపింది. ఉద్యోగి పనిచేసే విభాగాన్ని బట్టి సంబంధిత శాఖల పర్యవేక్షణలో బదిలీలు జరుగుతాయి.

సచివాలయ ఉద్యోగులపై కక్ష

అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కూటమి ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్న విమర్శలున్నాయి. సర్వేల పేరిట తిప్పడం, గతంలో వలంటీర్లు చేసిన పనులను వీరికి అప్పగించడం ద్వారా పనిభారం పెంచేసింది. క్లస్టర్ల పేరిట ఉద్యోగులను క్రమబద్ధీకరించి మిగిలిన వారిని ఇతర శాఖల్లో భర్తీ చేసే యోచన చేస్తోంది. కేవలం రూ.29 వేల నుంచి రూ.31 వేల జీతంపై పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగులు సొంత మండలాల్లో పనిచేయకూడదన్న కూటమి ఆదేశాలు ఇవ్వడం, బదిలీలపై స్పష్టత ఇవ్వకపోవడం వారిని మరింత ఇబ్బంది పెట్టేందుకేనని పలువురు విమర్శిస్తున్నారు.

గత ప్రభుత్వంలో పారదర్శకంగా..

ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేస్తూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తెచ్చారు. రాజకీయ జోక్యం, అవినీతి, అక్రమాలకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా సచివాలయ ఉద్యోగుల నియామకాలు చేశారు. గ్రామాల్లో రెండు వేలు, పట్టణాల్లో నాలుగు వేల జనాభా ప్రాతిపదికన సచివాలయాలను ఏర్పాటుచేశారు. గ్రేడ్ 4 పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్, ఏఎన్‌ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్, విలేజ్ సర్వేయర్, అగ్రికల్చర్ అసిస్టెంట్, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్, ఉద్యాన అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్ తదితర పోస్టులను నియమించారు. తద్వారా జిల్లాలో వేలాది మంది నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించారు. 35 శాఖలకు చెందిన 500లకు పైగా సేవలను అందుబాటులోకి తెచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాలయాలను నిర్వీర్యం చేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది.

నేడు ఎంటీఎస్ టీచర్ల బదిలీల కౌన్సెలింగ్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్) టీచర్లకు శుక్రవారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ఏలూరు డీఈఓ ఎం.వెంకటలక్ష్మమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏలూరులోని జీఎంసీ బాలయోగి సైన్స్‌పార్క్‌లో ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

• ప్రాణాలతో సదరంగం


కుమారుడిని ఎత్తుకుని తీసుకువస్తూ..


దీనంగా వేచిచూస్తూ..


తల్లి సాయంతో ఓ కుమారుడు

కూటమి ప్రభుత్వంలో దివ్యాంగులకు అవస్థలు తప్పడం లేదు. సామాజిక పింఛన్ల ఏరివేతలో భాగంగా దివ్యాంగులు మళ్లీ సదరం సర్టిఫికెట్ తీసుకోవాలంటూ అధికారులు కొర్రీలు పెట్టి ఆస్పత్రుల చుట్టూ తిప్పుతున్నారు. దీంతో దివ్యాంగులు, మానసిక వికలాంగులు నానా ప్రయాసలు పడుతూ ఏలూరు జీజీహెచ్‌లో సదరం క్యాంపునకు హాజరవుతున్నారు. మండుటెండల్లో దూర ప్రాంతాల నుంచి సహాయకులను తీసుకుని ఆందోళనతో వస్తున్నారు. బుధవారం ఇలానే ఓ వృద్ధుడు జీజీహెచ్‌కు వచ్చి గుండె ఆగి ప్రాణాలు విడిచాడు. అయినా అధికారుల్లో చలనం లేదు. సదరం కేంద్రాలు నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటుచేయాలని పెంఛన్‌దారులు కోరుతున్నారు. గురువారం ఏలూరు జీజీహెచ్ వద్ద కనిపించిన దృశ్యాలివి.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ ఏలూరు


వృద్ధుడికి తప్పని తిప్పలు


ఏలూరు జీజీహెచ్ ప్రాంగణంలో వేచి ఉన్న పెంఛన్‌దారులు


ఓటీపీ కోసం బారులు తీరి..

అధిక ఫీజులను ఉపేక్షించం

భీమవరం: ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల వసూలు, విద్యా సామగ్రి అమ్మకాలను ఉపేక్షించబోమని కలెక్టర్ సీహెచ్ నాగరాణి హెచ్చరించారు. గురువారం స్థానిక విష్ణు కళాశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల యజమానులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు వారి పిల్లలు భవిష్యత్తును గొప్పగా ఊహించుకుని ఫీజులు భారమైన ప్రైవేట్ స్కూల్స్ వైపు మొగ్గుచూపి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. దీనికి తోడు పుస్తకాలు, విద్యా సామగ్రి, కల్చరల్ యాక్టివిటీస్ వంటి వాటి పేరుతో యాజమాన్యాలు వసూలు చేస్తున్నాయన్నారు. కొన్ని పాఠశాలలు సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ సిలబస్ అని చెప్పుకుంటున్నాయని, ఏ సిలబస్ అయినా ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడపాల్సిందేనని స్పష్టం చేశారు. అధిక ఫీజులు వసూలుపై ఎంఈఓలు, డిప్యూటీ డీఈఓలు, డీఈఓ ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రైవేట్ పాఠశాలల్లో క్వాలిఫైడ్ టీచర్లను మాత్రమే నియమించాలని, పాఠశాల వేళలను ప్రభుత్వం సూచించిన మేరకు కచ్చితంగా పాటించాలన్నారు. ఆర్జేడీ జి.నాగమణి, డీఈఓ ఈ.నారాయణ, ఎస్ఎస్ఏ పీఓ పి.శ్యామ్‌సుందర్, డిప్యూటీ డీఈఓలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

4,835 చోట్ల యోగా కార్యక్రమాలు

భీమవరం(ప్రకాశంచౌక్): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21న జిల్లాలో 4,835 చోట్ల యోగా కార్యక్రమాల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు.

ఎన్‌ఎంఎంఎస్ ఫలితాలు విడుదల

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయని ఏలూరు డీఈఓ ఎం.వెంకటలక్ష్మమ్మ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థుల మెరిట్ కార్డులను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారన్నారు. మెరిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకుని సరిచూసుకోవాలని సూచించారు. అనంతరం జాతీయ విద్యా మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ వారి పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. సంబంధిత స్కూల్ నోడల్ ఆఫీసర్, జిల్లా నోడల్ ఆఫీసర్, లాగిన్ (డీఎస్ఓ) ద్వారా అప్లికేషన్‌ను ధ్రువీకరించుకోవాలని కోరారు.

యోగా భారత ప్రాచీన సంపద



భీమవరం డీఎన్నార్ కళాశాలలో యోగాసనాల్లో పాల్గొన్న ప్రజలు

భీమవరం: యోగా దేశ ప్రాచీన సంపద అని, ప్రపంచానికి యోగాను పరిచయం చేసింది భారతదేశం అని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమ శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. స్థానిక డీఎన్నార్ కళాశాలలోని మైదానంలో గురువారం ప్రత్యేక థీమ్ అథ్లెటిక్స్, స్పోర్ట్స్, యూత్ గ్రూప్స్‌తో నిర్వహించిన మెగా యోగా ప్రదర్శన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా సాధనతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు, పీఏసీ చైర్మన్, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. కలెక్టర్ సీహెచ్ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ వి.భీమారావు, డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, ఆర్డీఓలు, అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.


కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

న్యూస్‌రీల్

పోలీస్ గస్తీకి కొత్త వాహనాలు


వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎస్పీ నయీం అస్మి

భీమవరం: జిల్లాలో ట్రాఫిక్ నియంత్రణ, శక్తి బృందాల గస్తీకి కేటాయించిన 16 నూతన మోటార్ సైకిళ్లను గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం వద్ద ఎస్పీ అద్నాన్ నయీం అస్మి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనాల ద్వారా ప్రజలకు మరింత సమర్థవంతమైన పోలీసు సేవలు అందించడానికి కృషి చేయాలన్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, మహిళలు, బాలికల భద్రతకు దోహదపడే శక్తి బృందాల గస్తీని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ వాహనాలు ఉపయోగపడతాయన్నారు. అడిషనల్ ఎస్పీ వి.భీమారావు, జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ఎంవీవీ సత్యనారాయణ, డీఎస్పీలు ఆర్‌జీ జయసూర్య, జి.శ్రీవేద, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్షలకు 97 శాతం హాజరు

భీమవరం: జిల్లాలోని ఐదు కేంద్రాల్లో గురువారం నిర్వహించిన మెగా డీఎస్సీ పరీక్షలకు 97 శాతం అభ్యర్థులు హాజరయ్యారని డీఈఓ ఈ.నారాయణ తెలిపారు. ఉదయం 623 మందికి 599 మంది, మధ్యాహ్నం 580 మందికి 568 మంది హాజరయ్యారన్నారు.

ఏలూరులో 1,030 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరులో గురువారం నిర్వహించిన డీఎస్సీ పరీక్షలకు 1,030 మంది అభ్యర్థులు హాజరయ్యారు. నగరంలోని సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో ఉదయం 174 మందికి 171 మంది, మధ్యాహ్నం 189 మందికి 180 మంది, ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 150 మందికి 141 మంది, మధ్యాహ్నం 140 మందికి 138 మంది హాజరయ్యారు. సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 197 మందికి 193 మంది, మధ్యాహ్నం 215 మందికి 207 మంది హాజరయ్యారని డీఈఓ ఎం.వెంకట లక్ష్మమ్మ తెలిపారు.

సమ్మెలోకి మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులు


కళ్లకు గంతలు కట్టుకుని నిరసన

తాడేపల్లిగూడెం (టీఓసీ): మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలోని అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే ఈనెల 22 నుంచి పూర్తిస్థాయిలో విధులు బహిష్కరించి సమ్మెలోకి వెళుతున్నట్టు ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగపు కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. నాయకులు మర్రిపూడి సతీష్ కుమార్, అవిడి కుమార్, నూకపల్లి శేఖర్, యర్రంశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, వేతనాలు పెంచాలని, కార్మికులను మానవ వనరుల విధానంలోకి తీసుకురావాలని, అన్నిరకాల బెనిఫిట్స్ అందజేయాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ యేసుబాబు, మున్సిపల్ ఇంజనీర్ వెంకట రమణ, అధికారులకు సమ్మె నోటీసులు అందించారు.

ఐటీఐల్లో ప్రవేశాలు

ఉండి: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాలకు వచ్చేనెల 15న సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులకు గడువు ఉందని ఐటీఐ జిల్లా కన్వీనర్ వి.శ్రీనివాసరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాస్ లేదా ఫెయిలైన విద్యార్థులు ఐటీఐ డాట్ ఏపీ డాట్ జీఓవీ డాట్ ఇన్ అనే ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకుని, సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలో సర్టిఫికేషన్ వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. వివరాలకు 08816 297093, 9676099988లో సంప్రదించాలని సూచించారు.

సాగుదారుల చట్టంపై ప్రచారోద్యమం

ఏలూరు (టూటౌన్): దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ జాయింట్ డైరెక్టర్ షేక్ హబీబ్ బాషా చేతులమీదుగా పంట సాగుదారులు చట్టంపై ప్రచారోద్యమం కరపత్రాలను గురువారం విడుదల చేశారు. హబీబ్ బాషా మాట్లాడుతూ జిల్లాలో డీబీఆర్‌సీ 2025– 26కి గాను భూమి ఉన్న రైతులు, కౌలుదారులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించడం శుభపరిణామమన్నారు.

క్లుప్తంగా

యానాం మద్యం విక్రేతకు రూ.లక్ష జరిమానా


మద్యం అక్రమ రవాణా దారుడితో సీఐ మణికంఠరెడ్డి

తణుకు అర్బన్: యానాం మద్యం విక్రయాలు చేస్తున్న వ్యక్తికి ఇరగవరం మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్, తహసీల్దార్ ఎం.సుందరరాజు రూ.లక్ష జరిమానా విధించినట్లు తణుకు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ సీఐ సత్తి మణికంఠరెడ్డి తెలిపారు. ఇరగవరం మండలం కంతేరు గ్రామానికి చెందిన కొవ్వూరి శ్రీనివాసరెడ్డి ఇటీవల రెండు పర్యాయాలు యానాం మద్యంతో దొరికిన నేపథ్యంలో ఈ భారీ జరిమానా విధించినట్లు స్పష్టం చేశారు. ఈ ఏడాది మార్చి 7న కంతేరు గ్రామంలో కారులో 43.1 లీటర్ల యానం మద్యం తరలిస్తూ తణుకు ఎక్సైజ్ శాఖ దాడుల్లో పట్టుబడ్డాడని, దీంతో అతడిని ఇరగవరం మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ వద్ద రూ.లక్ష పూచీకత్తుతో ఏడాది కాలానికి బైండోవర్ చేయడం జరిగిందన్నారు. సత్ప్రవర్తన బాండ్‌ను ఉల్లంఘించి తిరిగి మే 26న యానాం నుంచి మద్యాన్ని కారులో రవాణా చేస్తూ తణుకు ఎక్సైజ్ శాఖకు మరోసారి పట్టుబడ్డాడని చెప్పారు. దీంతో ఈనెల 11న ఇరగవరం తహసీల్దార్ వద్ద హాజరపరచగా దీనిపై విచారణ అనంతరం విధించిన జరిమానాను ముద్దాయి గురువారం చెల్లింపు చేసినట్లు వివరించారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు


మద్దాలి కిరణ్‌బాబు

ముదినేపల్లి రూరల్ : యువకుడి అదృశ్యంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల ప్రకారం మండలంలోని పెదగొన్నూరు శివారు కర్షకమాలపల్లికి చెందిన మద్దాల మరియమ్మ కుమారుడు కిరణ్‌బాబు ముదినేపల్లి, బంటుమిల్లి, సింగరాయపాలెం గ్రామాల్లోని స్వీటుషాపుల్లో పనిచేసేవాడు. ప్రతిరోజు వచ్చే ఆదాయంతో మద్యం సేవించి తల్లిని దుర్భాషలాడుతూ బాధపెట్టేవాడు. ఈ ఏడాది మార్చి 30న మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వమని తల్లి మరియమ్మను ఒత్తిడి చేశాడు. అందుకు నిరాకరించడంతో తల్లిని తూలనాడి ఇంటినుంచి వెళ్లిపోయాడు. నాటి నుంచి కిరణ్‌బాబు ఆచూకీ తెలియకపోవడంతో తల్లి మరియమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై వీరభద్రరావు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కామ్రేడ్ సుధాకర్ సేవలు ఎనలేనివి


సంస్మరణ సభలో మాట్లాడుతున్న అభిమానులు

పెదపాడు: మండలంలోని సత్యవోలులో కామ్రేడ్ తెంటు సుధాకర్ సంస్మరణ సభ గురువారం నిర్వహించారు. సీపీఐఎంఎల్ సానుభూతిపరులు, విరసం నాయకులు, కళాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థిగా, డాక్టర్‌గా, కామ్రేడ్‌గా సుధాకర్ ఎనలేని సేవలందించారని కొనియాడారు. పేద, బడుగు, పీడిత ప్రజల కోసమే సుధాకర్ తన జీవితాన్ని త్యాగం చేశారని, ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కొండారెడ్డి, కృష్ణ లావేటి శ్రీనివాసరావు, తూర్పు కాపు కార్పొరేషన్ డైరక్టరు లావేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మద్ది హుండీల ఆదాయం రూ.54.71 లక్షలు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో హుండీ ఆదాయన్ని గురువారం లెక్కించినట్టు మద్ది ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు. 85 రోజులకు హుండీల ద్వారా రూ.49,67,182, చిల్ల రూపేణా రూ.4,22,927, అన్నదానం హుండీ ద్వారా రూ.81,370 మొత్తం ఆదాయం రూ.54,71,479 వచ్చినట్టు చెప్పారు. ఏలూరు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ఈఓ కలగర శ్రీనివాస్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేవీబీ బ్యాంకు సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

యోగా మంత్రం.. ఒత్తిడిలో యంత్రాంగం

- యోగాంధ్ర విజయవంతానికి ప్రభుత్వం కుస్తీలు
- ఉద్యోగులు, సిబ్బందిపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి


భీమవరంలో యోగాసనాలు వేస్తున్న దృశ్యం (ఫైల్)


కుముదవల్లిలో ఉద్యోగుల యోగాసనాలు (ఫైల్)

పాలకోడేరు: కూటమి ప్రభుత్వం కొన్ని రోజులుగా నిరంతరం యోగా మంత్రం జపిస్తుండడంతో ప్రభుత్వ యంత్రాంగం ఒత్తిడిలో కొట్టుమిట్టాడుతోంది. యోగాంధ్ర కార్యక్రమానికి మే 21 నుంచి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విశాఖ కేంద్రంగా లక్షల మందితో నిర్వహించాలని నిర్ణయించారు. ప్రధాని మోదీ కూడా హాజరవుతుండడంతో ఎలాగైనా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కుస్తీలు పడుతోంది. దీంతో అధికారులు, ఉద్యోగులకు క్షణం తీరిక లేకుండా పోయింది. యోగాంధ్ర ఎన్‌రోల్‌మెంట్, మాస్టర్ ట్రైనీ, రిజిస్ట్రేషన్, యోగ ప్రొటోకాల్ ఆసనాలు పూర్తి చేసినప్పటికీ జిల్లాస్థాయి యోగాసనాల పోటీల నిర్వహణ మాత్రం తమ వల్ల కాదని చేతులెత్తేస్తున్నారు. ఎందుకంటే సాధ్యం కానీ అలవాటు లేని ఆసనాలతో పోటీలు నిర్వహించాలని అధికారులు మార్గదర్శకాలు పేర్కొనడంతో కొత్తగా యోగా నేర్చుకున్న తాము ఈ ఆసనాలను ఎలా వేయగలమంటూ పోటీల్లో పాల్గొనడానికి ఎవరూ ముందుకు రావడం లేదు.

ఇవేం పోటీలు?

జిల్లా స్థాయిలో యోగా పోటీలకు సంబంధించి 10 నుంచి 18 సంవత్సరాలు, 19 నుంచి 35 సంవత్సరాలు, 35 పైబడి అంటూ మూడు భాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. వాస్తవానికి 50 ఏళ్ల పైబడిన కేటగిరీ ఇవ్వకపోవడంతో యోగాలో అనుభవం, ఆసక్తి ఉన్న ఆ వయస్సు వారితో పోటీ పడే పరిస్థితి ఏర్పడింది. వారంతా పోటీలో పాల్గొనడానికి ఆసక్తి కనపరచడం లేదు. ఇప్పుడిప్పుడే నేర్చుకుంటున్న వారిని సైతం పోటీల్లో అభ్యర్థులుగా చేర్చడంతో క్లిష్టతరమైన ఆసనాలు వేయలేమని తమ పేర్లను తొలగించాలని వారు కోరుతున్నారు. చిన్న పిల్లలకు ఆకర్ణ ధనురాసనం, బకాసనం, 19 నుంచి 35 సంవత్సరాల విభాగంలో మత్స్యేంద్రాసనం, జిల్లా స్థాయిలో విభక్త పశ్చిమోత్తాసనం తదితర ఆసనాలు వేయాలని సూచించారు. రాష్ట్ర స్థాయిలో పూర్ణమత్స్యేంద్రాసనం, ఓంకారాసనం, కర్ణ పీడనాసనం ఇచ్చారు. మండల స్థాయి పోటీలను ఏదోలా మమ అనిపించినప్పటికీ జిల్లా స్థాయి పోటీలకు వెళ్లేవారిని పంపించడం కష్టతరమేనని అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

సమయం వృథా అంటూ ఆవేదన

యోగాంధ్ర కార్యక్రమం కోసం ప్రతిరోజు కలెక్టర్ నుంచి ఆయుష్ విభాగం అధికారులు పలు శాఖల జిల్లా స్థాయి అధికారులు గూగుల్ మీట్, వెబెక్స్ నిర్వహిస్తుండడంతో గంటల కొద్ది సమయం వృథా అవుతుందని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని మూడు రోజులపాటు ఎటువంటి శ్రమ లేకుండా చేపట్టామని అధికారులు చెబుతుండడం గమనార్హం. అప్పటి ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది. కానీ ఇప్పుడు యోగాంధ్ర కోసం నెలరోజుల పాటు నరకయాతన పడుతున్నామని అధికారులు తమ అంతర్గత సంభాషణలో తలలు పట్టుకుంటున్నారు. ఈ కార్యక్రమంతో పని ఒత్తిడి భరించలేక సచివాలయం నుంచి మండల స్థాయి ఉద్యోగులు అంతా నరకం చూస్తున్నారు.

హత్యాయత్నం కేసులో ముద్దాయికి జైలు శిక్ష

ఉండి: హత్యాయత్నం కేసులో ముద్దాయికి జైలు శిక్ష విధించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 2017లో మండలంలోని కోలమూరు గ్రామంలో కొమ్మర కనకారావు మీద జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడు సిర్ర కనకారావుపై నేరం రుజువు కావడంతో అతడికి భీమవరం అసిస్టెంట్ సెషన్స్‌కోర్టు జడ్జి ఎం సుధారాణి మూడు నెలల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధించినట్లు ఎస్సై ఎండీ నసీరుల్లా తెలిపారు. కేసు విచారణకు సహకరించిన సిబ్బందిని ఎస్పీ అద్నాన్ నయీం ఆస్మి అభినందించినట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

పెనుగొండ: అనారోగ్య సమస్యలతో సిద్ధాంతంకు చెందిన జనిపిరెడ్డి నాగమణి(55) ఆత్మహత్యకు పాల్పడినట్లు పెనుగొండ ఎస్సై కే గంగాధరరావు తెలిపారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నాగమణి బాధను భరించలేక ఇంట్లో బాత్రూం క్లీన్ చేసే యాసిడ్ తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన బంధువలు ఆమెను తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. నాగమణి చిన్న కుమార్తె చిలక కాంచన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఈ సమ్మర్ చాలా కూల్ గురూ..

- వేసవిలో గోదావరి జిల్లాల్లో నమోదైన అత్యల్ప ఉష్ణోగ్రతలు
- రోహిణి కార్తెలో కూడా ఎండలు ప్రభావం చూపని వైనం
- రుతుపవనాలు విస్తరించడంతో చల్లబడ్డ వాతావరణం



నరసాపురం: ఈ ఏడాది వేసవి ఆరంభంలోనే ఎండలు అదరగొట్టాయి. ఉమ్మడి పశ్చిమలో ఫిబ్రవరి నెలలోనే 40 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మార్చి, ఏప్రిల్ నెలల్లో కూడా భానుడు ప్రతాపం చూపించాడు. దీంతో ఈఏడాది వేసవిలో ఎండల ప్రతాపం దారుణంగా ఉంటుందని అంచనా వేశారు. వేసవిలో గరిష్టస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయని జనవరి నెలలోనే విశాఖ వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేసినా అందుకు భిన్నంగా అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మే నెలలో అయితే ఉమ్మడి పశ్చిమలో ఎక్కడా కూడా 40 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదు కాలేదు. జూన్ మొదటి వారంలో అత్యధికంగా 41 డిగ్రీలు, అత్యల్పంగా 39 డిగ్రీలు నమోదయ్యాయి. దీనికి తోడు ఈ ఏడాది రుతుపవనాల రాక కూడా దాదాపు 20 రోజులు ముందుగానే రావడంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. ప్రస్తుతం రుతుపవనాలు పూర్తిగా విస్తరించడంతో వర్షాలు పడుతున్నాయి. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో 2005 తరువాత వేసవిలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఇదే ప్రథమం. దీంతో గోదావరి జిల్లాల వాసులు ఈ ఏడాది వేసవి తాపం తెలియకుండానే వర్షాకాలంలోకి ప్రవేశించారు.

మే మొత్తం కూల్.. జూన్‌లో కొంత ప్రభావం

ఈ ఏడాది మే నెల మొత్తం ఉమ్మడి పశ్చిమలో ఎండల ప్రభావం అంతగా కనిపించలేదు. అంతేకాకుండా మే 16, 17 తేదీల్లో వర్షాలు పడ్డాయి. గత ఏడాది కూడా మే నెలలో ఇదే సమయంలో వర్షాలు పడ్డాయి. అయితే తరువాత వడగాలులు దుమ్మురేపాయి. గత ఏడాది వడగాలులకు ఉమ్మడి జిల్లాలో 16 మంది మృత్యువాత పడ్డారు. అయితే ఈ ఏడాది వడగాలుల మరణాలు నమోదు కాకపోవడం విశేషం. ఇక మేనెల ఎండంటే తెలియకుండా గడిపేసిన జిల్లా వాసులకు జూన్ మొదటి వారంలో కొంత ప్రభావం కనిపించింది. జూన్ 2, 3 తేదీల్లో కొన్ని ప్రాంతాల్లో 41 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మళ్లీ తరువాత అంతకు మించి ఉష్ణోగ్రతలు నమోదు కాలేదు.

రోహిణీ కార్తె ప్రభావం కూడా కనిపించలేదు

ఈ ఏడాది మే 24 వతేదీ నుంచి రోహిణీ కార్తె ప్రారంభమైంది. రోహిణి కార్తెలో ఎండలకు రోళ్లు పగులుతాయని నానుడి ఉంది. రికార్డు స్థాయిలో ఉండే రోహిణి కార్తె ఎండలకు జనం బెంబేలెత్తుతూ ఉంటారు. అయితే ఈ ఏడాది రోహిణి కార్తె కూడా సాధారణ ఉష్ణోగ్రతలో కూల్‌గా గడిచిపోవడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు. మొత్తానికి ఈ ఏడాది వేసవి పెద్దగా ఇబ్బంది పెట్టకుండా కూల్‌గా గడిచిపోవడం విశేషం.

అప్పుడు కరోనా కారణంగా ఇళ్లలో ఉండి..

కరోనా కారణంగా వేసవిలో వరుసగా రెండేళ్లపాటు జనం ఇళ్లకే పరితమై వేసవి ప్రభావం పడకుండా తప్పించుకున్నారు. 2020 సంవత్సరంలో కరోనా విలయతాండవం, లాక్‌డౌన్ కారణంగా ఏప్రిల్, మే నెలలు మొత్తం జనం ఇళ్లకే పరిమితమయ్యారు. ఇక 2021లో కూడా మార్చి నెలలోనే కరోనా సెకండ్‌వేవ్ ప్రభావం ప్రారంభమైంది. ఏప్రిల్, మే నెలల్లో కల్లోలంగా మారడంతో దీంతో జనం పెద్దగా రోడ్కెక్కలేదు. ఆ రకంగా రెండేళ్ల అధిక మొత్తంలో జనం ఇళ్లపట్టునే ఉండి భానుడి ప్రతాపాన్ని చాలా వరకూ తప్పించుకున్నారు. నిజానికి ఈ రెండేళ్లు కూడా జిల్లాలో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిల్లోనే నమోదయ్యాయి. అయితే ఈ సంవత్సరం మాత్రం రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు నమోదు కాకపోవడంతో జనం కూల్ కూల్‌గా ఖుషీ అయ్యారు.

యథేచ్ఛగా కంకర అక్రమ తవ్వకాలు


చెరువులో తవ్వకాలు చేస్తున్న పొక్లెయినర్, జేసీబీ

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : కూటమి పాలనలో మట్టి దందా దోచుకున్నోళ్లకు దోచుకున్నంత అన్న చందంగా తయారైంది. కోర్టు నుంచి స్టే ఉన్నా వారు లెక్క చేయని పరిస్థితి. ఉంగుటూరు మండలం నల్లమాడులో కంకర అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. మూడు తరాల నుంచి ఒక పేద కుటుంబం హక్కు భుక్తంలో ఉన్న మెరసుకుంటను ఆనుకొని ఉన్న సుమారు ఒకటిన్నర ఎకరం కంకర బీడులో 15 రోజులుగా ఇష్టారాజ్యంగా తవ్వకాలు సాగిస్తున్నారు. పెద్ద ఎత్తున కంకరను జేసీబీలు, పొక్లయినర్ల సాయంతో తవ్వి లారీలు, ట్రాక్టర్ల ద్వారా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మునసబోయిన అంజమ్మకు చెందిన ఈ భూమి విషయంలో హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నా కూటమి నాయకలు లెక్కచేయడం లేదు. పంచాయతీ, ఇరిగేషన్ అధికారుల అనుమతితో తవ్వకాలు చేస్తున్నట్లు ఆ నాయకులు ప్రచారం చేస్తున్నారు. ఈ విషయంలో గ్రామ, మండల స్థాయి అధికారుల జేబులు నింపుతున్నారని వినికిడి. కంకర తవ్వకాలపై గ్రామ రెవెన్యూ అధికారి నాగరాజుని వివరణ కోరగా కంకర తవ్వకాలకు అనుమతులు ఉన్నట్లు చెబుతున్నారు.

భర్తకు దేహశుద్ధి చేసిన భార్య

వివాహేతర సంబంధం కొనసాగిస్తుండడంపై ఆవేదన


కొయ్యలగూడెం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్ద భర్తతో వాగ్వివాదం చేస్తున్న పూజిత


న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్ వద్ద పిల్లలతో పూజిత నిరసన

కొయ్యలగూడెం: భర్తకు భార్య దేహశుద్ధి చేసిన ఘటన గురువారం కొయ్యలగూడెంలో చోటుచేసుకుంది. బాధితురాలు పూజిత తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొయ్యలగూడెంలో ప్రైవేట్ బ్యాంకులో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావుకు చిట్యాల గ్రామానికి చెందిన పూజితకు 11 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు ఆడపిల్లలు సంతానం. అయితే మగపిల్లాడు కావాలని పూజితను అత్తమామలు, భర్త వేధింపులకు గురి చేస్తున్నారు. ఆమె నుంచి విడాకులు కావాలని భర్త కోర్టును ఆశ్రయించగా కోర్టు పూజితకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. దీంతో బంధువులు, మహిళ మండలి సంఘాల మద్దతుతో గురువారం పూజిత శ్రీనివాసరావు ఇంటికి వెళ్లగా అదే సమయంలో భర్త మరో మహిళతో వివహేతర సంబంధం పెట్టుకొని సహజీవనం చేస్తున్నాడని తెలియడంతో అవాక్కయింది. పైగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న మహిళకు ఆరు నెలల పాప ఉందని తెలియడంతో ఆమెను కూడా తీసుకొని బ్యాంకు వద్దకు వెళ్లి నిరసన తెలిపింది. దీంతో శ్రీనివాసరావు, పూజితల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా మహిళా సంఘాలు బంధువులు కలిసి శ్రీనివాసరావుకు దేహశుద్ధి చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శ్రీనివాసరావును, పూజితను స్టేషన్‌కు తీసుకుని వెళ్లారు. కోర్టు తనకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని, తనకు న్యాయం చేయాలని బాధితురాలు పూజిత కోరుతోంది. కాగా దీనిపై పూర్తిస్థాయి విచారణ చేయాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

సెల్ సిగ్నల్స్‌తో సేఫ్

- సెల్‌ఫోన్ సిగ్నల్స్‌తో కేసుల పరిష్కారం
- లొకేషన్లు గుర్తించి కేసులను ఛేదిస్తున్న పోలీసులు


ఆకివీడు-చెరుకువాడ రైల్వే స్టేషన్ మధ్య లభించిన హ్యాండ్ బ్యాగ్

ఆకివీడు: కేసుల పరిష్కారంలో సెల్‌ఫోన్ సిగ్నల్స్ పోలీసులకు ఎంతగానో ఉపకరిస్తున్నాయి. తాజాగా జరిగిన ఘటనలే ఇందుకు తార్కాణం. బుధవారం ఉదయం హైదరాబాద్‌లోని గోషామహల్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రాథోడ్ సురేష్ భార్య సంధ్య విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో విజయనగరం బయలుదేరారు. ఆమెను వెంబడిస్తున్న అగంతకుడు ఆకివీడు ప్రాంతం వచ్చేసరికి ఆమె హ్యాండ్ బ్యాగ్‌ను కాజేసి, పారిపోయే అవకాశం లేకపోవడంతో ఆకివీడు-చెరుకువాడ మధ్య రైలు నుంచి బ్యాగ్ బయటకు విసిరివేశాడు. ఈ విషయాన్ని సంధ్య ఆమె భర్తకు ఫోన్ ద్వారా తెలియజేశారు. వెంటనే రాథోడ్ స్పదించి సెల్ సిగ్నల్ ద్వారా బ్యాగ్ ఏప్రాంతంలో పడిపోయిందో గుర్తించారు. వెంటనే ఆకివీడు ఎస్సై హనుమంతు నాగరాజుకు ఫోన్ ద్వారా విషయం తెలియజేసి, సిగ్నల్ ప్రాంతంను తెలియజేశారు. ఎస్సై నాగరాజు హుటాహుటీన తన సిబ్బంది శివ, విజయ్‌లతో వెదకగా చెరుకువాడ దగ్గర బ్యాగ్‌ను గుర్తించి, దానిలోని ఆభరణాలు, సెల్‌ఫోన్‌ను మరో సెల్‌ఫోన్ ద్వారా వీడియో తీశారు. విషయాన్ని కానిస్టేబుల్ రాథోడ్‌కు తెలియజేశారు. బాధితురాలు సంధ్యకు హ్యాండ్ బ్యాగ్ అందజేశారు. అగంతకుడి కోసం విచారణ చేపట్టారు.

ప్రమాదవశాత్తూ జారిపడిన బాధితుడి గుర్తింపు

ఇటీవల మండలంలోని కమతవానిగూడెంకు చెందిన వలస కార్మికుడు తిరుపతి నుంచి రైలులో ఆకివీడు వస్తుండగా మార్గమధ్యలో జారిపడిపోయాడు. రైలులో ఉన్న అతని బంధువులు వెంటనే ఆకివీడు పోలీసులకు తెలియజేశారు. బాధితుడి వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా కావలి ప్రాంతంలో పడిపోయి ఉన్నాడని గుర్తించి ఆకివీడు ఎస్సై నాగరాజు వెంటనే సమీపంలోని పోలీసులకు తెలియజేడంతో అక్కడి పోలీసులు వెళ్లి గాయాలతో పడి ఉన్న అతడ్ని రక్షించి, వైద్యం అందజేశారు. ప్రస్తుతం ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నాడు. హ్యాండ్ బ్యాగ్ చోరీ కేసును కూడా ఛేదించడంతో ఆకివీడు ఎస్సై నాగరాజుకు, పోలీస్ సిబ్బందికి పలువురు అభినందనలు తెలిపారు.

వ్యక్తిపై హత్యాయత్నం


చికిత్స పొందుతున్న బాధితుడు నాగరాజు

ఏలూరు టౌన్, పెదపాడు : దెందులూరు నియోజకవర్గం పెదపాడు గ్రామంలో ఒక వ్యక్తిపై హత్యాయత్నం జరిగింది. గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు కత్తులు, రాడ్లతో దాడులకు పాల్పడ్డారు. బాధితుడి మెడభాగంలో తీవ్ర గాయం కావటంతో అతడ్ని ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. టీడీపీకి చెందిన కార్యకర్తల ఆధ్వర్యంలో పాతకక్షల నేపథ్యంలోనే ఈ దాడులు జరిగాయంటూ బాధితులు ఆరోపిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెదపాడు గ్రామానికి చెందిన ముమ్మిడి నాగరాజు భవన నిర్మాణ సామాగ్రిని సరఫరా చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. గురువారం సాయంత్రం పెదపాడు సినిమా థియేటర్ సెంటర్‌లోని ఒక స్థలం వద్ద ట్రాక్టర్‌లో ఇసుక లోడ్‌ను చేస్తుండగా రెండు మోటారు సైకిళ్లపై నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఒక్కసారిగా అతనిపై దాడి చేశారు. కత్తులు, ఇనుప రాడ్లతో దాడి చేయటంతో నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. నాగరాజు పక్కన ఉన్న మణిశ్రీ అనే వ్యక్తి దాడిని అడ్డుకునే ప్రయత్నం చేయగా నలుగురు అతనిపై దాడి చేసేందుకు రావటంతో అక్కడి నుంచి పరారయ్యాడు. పాత కక్షల నేపథ్యంలోనే తనపై దాడి జరిగిందని బాధితుడు నాగరాజు పోలీసులకు వాంగ్మూలం ఇచ్చాడు.

ఏడాది చివరికి ఎలక్ట్రిక్ బస్సులు

నూజివీడు: రాష్ట్రానికి ఈ ఏడాది చివరి నాటికి 750 ఎలక్ట్రిక్ బస్సులు రానున్న నేపథ్యంలో వాటిలో జోన్-2 పరిధిలోని విజయవాడకు 100 బస్సులు, కాకినాడకు 50, రాజమండ్రికి 50 బస్సులు చొప్పున కేటాయించనున్నట్లు ఆర్టీసీ జోన్-2 ఈడీ జీ విజయరత్నం పేర్కొన్నారు. నూజివీడులోని ఆర్టీసీ బస్సు డిపోను గురువారం ఆయన సందర్శించి అన్ని విభాగాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేసి డిపోను లాభాల్లో నడపాలన్నారు. బస్సులు సైతం సమయపాలనతో నడిచేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ బస్సులు రావడం వల్ల కాలుష్యం తగ్గడంతో పాటు ఆర్టీసీపై డీజిల్ భారం సైతం తగ్గుతుందన్నారు. ప్రయాణికుల ఆక్యుపెన్సీ రేషియో బాగుంటే నూజివీడు డిపో నుంచి దూర ప్రాంతాలకు కచ్చితంగా బస్సు సర్వీసులను నడుపుతామన్నారు. బెంగళూరు, శ్రీశైలం వంటి దూర ప్రాంతాలకు ఇప్పటికే సర్వీసులు నడుపుతున్నామన్నారు. నాన్‌స్టాప్ బస్సు సర్వీసులను పెంచాల్సిన అవసరం ఉందని, పెంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. హైదరాబాద్ తిరిగే సర్వీసులు కచ్చితంగా సమయానికి బయలుదేరి వెళ్లాల్సిందేనన్నారు. బస్టాండ్‌లో ఉండే కంట్రోలర్‌లు బస్సులు సమయానికి వెళ్తున్నాయా, లేదా అనే విషయాన్ని పర్యవేక్షించాలన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సీహెచ్ సూర్యపవన్ కుమార్, ట్రాఫిక్ సీఐ జీ రాంబాబు, పలు యూనియన్‌లకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న సంఘ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ) : ప్రాంతీయ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో పేద విద్యార్థినికి గురువారం పట్టణంలో రూ. 25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. తాడేపల్లిగూడెంనకు చెందిన కప్పల బిందు ఏలూరు ఆశ్రమం కాలేజీలో మత్తు విభాగంలో డిప్లమో చదువుతున్నారు. రెండో సంవత్సరంలోకి ప్రవేశించారు. మొదటి సంవత్సరంలో ఫీజులకు సంబంధించి గవర్నమెంట్ సహకారంతో మొదటి సంవత్సరం పూర్తి చేశారు. అయితే రెండో సంవత్సరంలో ఫీజులు కట్టే విషయంలో గవర్నమెంట్ సహకరించపోవడంతో పద్మశాలి సేవా సంఘానికి ఆమె ఆర్థిక స్థితిగతులను తెలియజేయగా ఈ మేరకు సంఘం కార్యవర్గ సభ్యులు సహకరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బత్తుల ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

మహిళల్లో చైతన్యం రావాలి



అవగాహనా కార్యక్రమంలో మాట్లాడుతున్న రత్నకుమారి

ఆకివీడు: మహిళలు అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉంటున్నారని, అదే విధంగా మోసపూరిత మాటలు నమ్మి మోసపోవద్దని మహిళా శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్ రత్నకుమారి పిలుపునిచ్చారు. స్థానిక సీడీపీఓ కార్యాలయంలో మహిళల్లోచైతన్యం, అక్రమ రవాణా నిరోధంపై గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సినిమాల్లో ఛాన్స్, సీరియల్స్‌లో ఛాన్సు, విదేశాలకు పంపుతామంటూ, అధిక డబ్బు ఆశ చూపి మహిళలకు, పిల్లలకు మోసపూరిత మాటలు చెప్పి అక్రమంగా తరలిస్తున్న ముఠాలపై జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ ముసుగులో మహిళలు కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. సైబర్ నేరాలు చాలా వేగంగా వ్యాప్తి చెందుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తంచేశారు. ప్రమాదాలకు గురైన సందర్భంలో 1098,100, 181,1930లకు ఫోన్‌చేసి రక్షణ పొందాలని సూచించారు.

రైతాంగ సమస్యల పరిష్కారానికి కృషి



పరిమి వెంకటేశ్వర రావు (భూపయ్య)

తాడేపల్లిగూడెం రూరల్: రైతాంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులైన పరిమి వెంకటేశ్వరరావు (భూపయ్య) తెలిపారు. కడియద్ద గ్రామానికి చెందిన ఆయన తన నియామకానికి సంబంధించి ఉత్తర్వులు గురువారం అందాయని చెప్పారు. తనను నియమించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

పార్టీ పదవులు బాధ్యతగా నిర్వహించాలి

నరసాపురం: పార్టీ అప్పగించిన పదవులను బాధ్యతగా నిర్వహించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడిగా నియమితులైన నడపన చిన్ని గురువారం రాత్రి ముదునూరిని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు చెప్పారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ పార్టీని సంస్థాగతంగా పూర్తి బలోపేతం చేసే చర్యల్లో భాగంగా మండల కమిటీలను నియమించామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మండలె కృష్ణ, చిట్టూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యామిత్ర కిట్ల అందజేత



విద్యార్థులకు విద్యామిత్ర కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెద తాడేపల్లి మహాత్మాజ్యోతిబాపూలే, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులకు గురువారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను అందజేశారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, ఎంఈవో–2 పీఎంకే.జ్యోతి మాట్లాడారు. అనంతరం పెదతాడేపల్లి గురుకుల పాఠశాల మధ్యాహ్న భోజన పథకానికి సన్నబియ్యం సరఫరాను ప్రారంభించి, విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. ఆహారం రుచిని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్షీణించిన పారిశుద్ధ్యం

- రహదారి అంచులే డంపింగ్ యార్డులు
- విజృంభిస్తున్న దోమలు
- ప్రబలుతున్న వ్యాధులు
- మచ్చుకైనా కానరాని 'స్వచ్ఛభారత్'
- స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్

పెంటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. విద్యాలయాలు, అంగన్‌వాడీ సెంటర్లు, పంచాయతీల ఎక్కడికక్కడే చెత్త దర్శనమిస్తోంది. రోడ్ల పక్కన నిలుచునే పరిస్థితి లేని తీరు కలవరపెడుతోంది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పట్టించుకోకపోవడంతో దయనీయ స్థితి నెలకొంది. ప్రధాన రహదారులు అంచులనే మున్సిపల్, గ్రామ పంచాయతీలు డంపింగ్ యార్డులుగా మార్చేస్తున్నాయి. పెంటపాడు మండలంలోని పలు గ్రామాల్లో రోడ్డు పక్కన ఉన్న చెత్త గుట్టలు, పిచ్చి మొక్కలు పెరిగిపోయి అడవులను తలపిస్తున్నాయి. రోడ్ల మార్జిన్‌లోనే రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపార ప్రకటనకు సంబంధించిన భారీ కటౌట్లు, బ్యానర్లు పెడుతున్నారు. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

చెత్తకు నిప్పు పెట్టడంతో...

అధికారుల నుంచి ఒత్తిడి రావడంతో చెత్త కుప్పలకు నిప్పు పెట్టి వదిలివేయడంతో తడిగా ఉండటంతో వీటి నుంచి వచ్చే పొగతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. రహదారిని అనుకొని ఉన్న గ్రామాల వద్ద చెత్త కుప్పలు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. దోమలు విజృంభించి వ్యాధులు బారిన పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రహదారులను శుభ్రం చేయించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



వల్లూరుపల్లిలో ఏరులా పారుతున్న మురుగునీరు

స్వచ్ఛ సంకల్పానికి తిలోదకాలు

స్వచ్ఛభారత్ లక్ష్యం నెరవేరడం లేదు. ఇప్పుడు కొత్తగా స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ పేరుతో చేపట్టే పారిశుద్ధ్య, కార్యక్రమాలు సైతం ఎక్కడా జరగడం లేదు. చెత్త రహిత వార్డులు, గ్రామాలుగా తీర్చిదిద్దాలనే సంకల్పానికి అధికారులు తిలోదకాలిస్తున్నారు. నిర్వహణ కొరవడి మండలంలోని పలు గ్రామాల్లో రోడ్ల వెంబడి చెత్త పేరుకుపోతుంది. ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటుంది. పారిశుద్ధ్య పనులు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు దుర్వాసనతో సావాసం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే పారుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని గ్రామాల్లో వీధులు డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగింపుపై అధికారులు ఏమాత్రం దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా చెత్త గుట్టలు గుట్టలుగా పేరుకుపోవడంతో దోమలు, ఈగలు లార్వాల సంతతికి నెలవుగా మారింది. దీంతో స్థానికులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు.



పెంటపాడు పాత ఎస్సీపేటలో మురుగునీరు చూపుతున్న స్థానిక మహిళ



అలంపురం జెడ్పీస్కూలు వద్ద శుభ్రత లేక అధ్వానంగా ఉన్న రహదారి

వ్యర్థాలన్నీ రోడ్ల పక్కనే..

మండలంలోని జాతీయ రహదారి ఇరువైపులా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఈ చెత్తకుప్పల వలన అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గాలి వీచినప్పుడు, వాహనాలు వేగంగా వెళ్లినప్పుడు చెత్త నుంచి కాగితాలు, పాలిథీన్ కవర్లు ఎగురొచ్చి వాహనాలపై పడుతుండడంతో డ్రైవర్లు వాటిని తీయబోయి ప్రమాదాల బారిన పడుతున్నారు. కాఫీ, భోజనం హోటళ్లు వంటి వ్యాపార సంస్థలు ఉండడంతో నిత్యం చెత్తను పట్టుకొని వచ్చి రోడ్డు పక్కనే వేస్తున్నారు. అంతేకాకుండా నిల్వ పదార్థాలను ఇక్కడే వేయడంతో ప్రజలు, వాహనదారులు ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇవేకాకుండా ఖాళీ కొబ్బరి బొండాలు, కోళ్లు, చేపల వ్యర్థాలు కూడా ఇక్కడే పడేస్తున్నారు. ఈ రహదారి ఇరువైపులా రాకపోకలు సాగించే వారికి నిత్యం ఆగచాట్లు తప్పడం లేదు. రాత్రిళ్లు వాహనాల వేగంతో పాటు ఈచెత్తనుంచి వచ్చే చెడు వాసనలు భరించలేకపోతున్నామని వాపోతున్నారు. తక్షణమే పంచాయతీల అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సార్.. నేనొస్తా

తణుకు అర్బన్: బదిలీల కాలం కావడంతో తణుకు విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో కొలువుకోసం నేనంటే నేనని ఉద్యోగులు పోటీపడుతున్నట్లుగా తెలుస్తోంది. ప్రధాన కుర్చీల కోసం చాలా కాలంగా ఆశ పడుతున్న ఉద్యోగులు తాము వచ్చేందుకు సిద్ధంగా ఉన్నామంటూ అమాత్యులకు అర్జీలు పెట్టుకుంటున్నట్లుగా సమాచారం. సార్ మీకు అనుకూలంగా ఉంటాం మీరు చెప్పినట్లే నడుచుకుంటామనే ధోరణిలో అధికార పార్టీ నాయకుల సిఫార్సులతో అమాత్యులను కలుస్తున్నారని కూటమి నేతలే చర్చించుకుంటున్నారు. తణుకు విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పాలమూరు శ్రీనివాస్ గతనెల 26వ తేదీన అనారోగ్యంతో మృతిచెందగా ప్రస్తుతం ఆ సీటు కోసం భారీగా ప్రయత్నాల నేపథ్యంలో ఎట్టకేలకు ఒక అధికారి పేరును ఉన్నతాధికారులు ఖరారు చేసినట్లుగా తెలుస్తోంది. కాగా నియోజకవర్గంలోని అసిస్టెంట్ ఇంజనీర్లకు సంబంధించి ఒకరు ఇటీవలే రిటైర్‌కాగా మిగిలిన సీట్లను దక్కించుకునేందుకు ఇతర ప్రాంతాల నుంచి తమ ప్రయత్నాలు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తణుకు విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో కొలువుకోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లుగా ఆ శాఖ వర్గాలే చెప్పుకుంటున్నాయి.



తణుకు విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం

ఆదాయవనరుగా తణుకు...

జిల్లాలో తణుకు ప్రాంతం ప్రశాంతతకు మారు పేరని అన్ని రకాలుగా ఆరోగ్యకరమైన వాతావరణం ఇక్కడ ఉంటుందనే నానుడితో ఉద్యోగులు ఈ ప్రాంతంలో కొలువుతీరడంతోపాటు రిటైర్ అయిన తరువాత కూడా ఇక్కడే సెటిల్ అవ్వాలని చూస్తుంటారు. వ్యాపార, వాణిజ్యపరంగా అభివృద్ధి చెందడమే కాకుండా పట్టణ విస్తీర్ణం కూడా బాగా పెరిగింది. తణుకు నియోజకవర్గంలో గృహాలు, దుకాణాలకు సంబంధించి 1.20 లక్షలకు పైగా విద్యుత్ మీటర్లు ఉన్నాయి. పట్టణ ప్రాంతంతోపాటు శివారులో సైతం భారీగా రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరగడం, బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలు అధికంగా జరగడం కూడా ఈ ప్రాంతం గతం నుంచి అభివృద్ధి పథంలో నడుస్తుందనడానికి నిదర్శనం. అయితే ఇదే అదనుగా విద్యుత్ శాఖలో కొందరు ఉద్యోగులు అక్రమ సంపాదనకు తెరతీశారని, లేఅవుట్‌లలో విద్యుత్ సరఫరాతో పాటు బహుళ అంతస్తుల భవనాల్లో ట్రాన్స్‌ఫార్మర్స్, విద్యుత్ మీటర్లు మంజూరులో భారీగానే వినియోగదారుల నుంచి అందినకాడికి గుంజుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు కొందరు ఉద్యోగులు ఈ తరహా లావాదేవీల్లో మునిగితేలుతున్నారని విద్యుత్ శాఖ వర్గాలు చెబుతుండడం విశేషం. ఆర్థికంగా ఎదిగిన తణుకు ప్రాంతానికి వస్తే నాలుగు కాసులు వెనకేసుకోవచ్చనే ఉద్దేశ్యంలో కొందరు ఆశావాహులు ఉన్నట్లుగా తెలుస్తోంది.

విద్యార్థులను మోసం చేసిన కూటమి సర్కార్

తాడేపల్లిగూడెం (టీఓసీ): కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విద్యార్థులను మోసం చేసిందని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి విమర్శించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల కూడలిలో గురువారం ఏఐఎస్ఏ కార్యకర్తల సమావేశం పి.రాజేష్ అధ్యక్షతన జరిగింది. అప్పలస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వివిధ షరతులు విధించి రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 29 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం డబ్బులు ఎగనామం పెట్టారన్నారు. అధికారంలోకి రాకముందు కుటుంబంలో ఎంత మంది ఉంటే అంత మంది విద్యార్థులకు రూ. 15,000 ఇస్తామని ప్రచారం చేశారని కానీ ఈ రోజు తీరా చేస్తే ప్రతి విద్యార్థికి రూ. 13 వేలు ఇచ్చారని, మిగిలిన రూ 2 వేలు పరిస్థితి ఎంటో తెలియదని విమర్శించారు. 300 యూనిట్స్ కరెంట్ బిల్లు రాకూడదని, ఫోర్ వీలర్స్ ఉండకూడదని, ఇలా రక రకాల సాకులు చెప్పి డబ్బులు వేయలేదన్నారు. ఎంత మంది విద్యార్థులు ఉంటే అంతమంది విద్యార్థులకు ఈ పథకాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం కళాశాల నూతన కమిటీని నియమించారు. కమిటీ అధ్యక్షుడిగా ఆర్.సాయి, కార్యదర్శిగా పి.పూర్ణలు ఎంపికయ్యారు. ఎ.అజయ్, ఎం.అశ్విని, ఎ.దినేష్ తదితరులు పాల్గొన్నారు.



ఏఐఎస్ఏ స్థానిక నూతన కార్యవర్గం

కూటమి పాలన అంతా మోసమే



పెంటపాడులో వైఎస్సార్ విగ్రహం వద్ద పుస్తకం ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

పెంటపాడు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ముప్పిడి సంపత్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు కై గాల శ్రీనివాస్‌లు అన్నారు. గురువారం పెంటపాడు కోనేరు చెరువు వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద జగన్ అంటే నమ్మకం- బాబు అంటే మోసం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాల్గొన్న పార్టీ నాయకులు కూటమిప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయినా ఇప్పటివరకు సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. ప్రశ్నించే పవన్‌కల్యాణ్ కూడా నోరుమెదపకుండా ఉండటం ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారు. పచ్చ మీడియా ప్రజలను వంచించి చేస్తున పాలనకు ప్రజలు చరమగీతం పాడాలన్నారు. తక్షణం హామీలపై కూటమి ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. జగనన్న ప్రభుత్వం ఏడాది కాలంలో ఎంతో మేలు చేసిన సంగతినిగుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బోణం వీరయ్య, కొవ్వూరిప్రసాద్‌రెడ్డి, రెడ్డి సూరిబాబు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అధికార పక్షాన్ని ప్రశ్నించే బాధ్యత ప్రతిపక్షానిదే

తాడేపల్లిగూడెం రూరల్: అధికార పక్షాన్ని ప్రశ్నించే బాధ్యత ప్రతిపక్షంపై ఉందని వైఎస్సార్ సీపీ జిల్లా కోఆర్డినేటర్ ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని కడియద్ద గ్రామానికి చెందిన పరిమి భూపయ్య వ్యవసాయ క్షేత్రంలో జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచిన సమయంలో ధర్నాలు చేశామని గుర్తు చేశారు. ప్రతిపక్షానికి దిశా నిర్దేశం చేయవలసిన అవసరం లేదన్నారు. అధికార పక్షాన్ని మేల్కొలిపే బాధ్యత ప్రతిపక్షంపై ఉందన్నారు. మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ హయంలో నియోజకవర్గాన్ని కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశామన్నారు. పంచాయతీ భవనం లేని గ్రామాలు ఉన్నాయని, సచివాలయాలు లేని గ్రామాలు లేవన్నారు. తాడేపల్లిగూడెంకు ఆర్డీవో, డీఎస్పీ కార్యాలయాలను తీసుకొచ్చారన్నారు. అటువంటి వ్యక్తిని నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. సూపర్‌సిక్స్‌లో ఏ ఒక్క హామీని చంద్రబాబు అమలు చేయలేదన్నారు. కోకో రైతులను రోడ్డున పారేశారన్నారు. గత ఏడాది అధిక వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని నేటికీ అందించలేదని, దీనికి కూటమి నాయకులు ఏం సమాధానం చెబుతారన్నారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కూటమి పాలనను ప్రజల్లోకి తీసుకెళ్తామని, అంతిమ తీర్పు ప్రజలదేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు, సొసైటీ మాజీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్, రాష్ట్ర రైతు విభాగం జాయింట్ సెక్రటరీ పరిమి వెంకటేశ్వర రావు (భూపయ్య), ఎమ్పీటీసీ దూలపల్లి సత్తియ్య, నాయకులు కైగాల శ్రీనివాస్, యాతం బూరయ్య, పరిమి భూపయ్య, యాతం సూర్యచంద్రరావు, ప్రత్తి రాజాబాబు, సనమండ్ర రమేష్, తారమట్ల శ్రీనివాస్, గుండుమోగుల సాంబయ్య, పోలిమోను శ్రీనివాస్, చీకట్ల మల్లేశ్వరరావు, వీర్లపాటి సత్యనారాయణ, కనుపూరి ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



కడియద్ద గ్రామంలో జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా కోఆర్డినేటర్ ముప్పిడి సంపత్‌కుమార్

యోగా సాధనతో ప్రశాంత జీవితం



సామూహిక యోగా



భవిత సెంటర్‌లో యోగాంధ్ర కార్యక్రమం

తాడేపల్లిగూడెం (టీఓసీ): భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో గురువారం ప్రత్యేక ఉపాధ్యాయుడు ఎస్‌కే బాల ఈశ్వరయ్య పర్యవేక్షణలో యోగాంధ్ర కార్యక్రమం జరిగింది. పిల్లలు ప్రత్యేక ఆసనాలు వేశారు. వక్త ఈశ్వరయ్య మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లలు ప్రతి రోజు తప్పనిసరిగా యోగా చేయాలన్నారు. పిల్లల్లో ప్రవర్తన సమస్యలు తగ్గుతాయని, ప్రజ్ఞ సామర్థ్యాలు పెరుగుతాయన్నారు. మానసిక ప్రశాంతత, ఒత్తిడిలను జయంచవచ్చునని చెప్పారు. తల్లిదండ్రులకు యోగాపై అవగాహన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయిని ఎం.చంద్రకుమారి, వై.అనిల్ కుమార్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పోతురాజు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఆర్.కోటయ్య, బి.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ముందుస్తుగా గురువారం పట్టణంలో ప్రోటోకాల్ సామూహిక యోగా కార్యక్రమం యాగర్లపల్లి ఫ్లైఓవర్ వద్ద నిర్వహించారు. పట్టణంలో యోగాంధ్రలో భాగంగా యోగా శిక్షణలు 11 ప్రదేశాలలో జరుగుతున్నాయి. ఆయా ప్రాంతాల నుంచి ప్రోటోకాల్ యోగాలో పాల్గొనేందుకు యోగా సాధకులు భారీగా పాల్గొన్నారు. వివిధ యోగా ఆసనాలు వేశారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, మునిసిపల్ కమీషనర్ ఏసుబాబు, తహసీల్దార్ సునీల్ కుమార్, ఎంపీడీవో విశ్వనాథ్, డీపీఓ మల్లిఖార్జునరావులు పాల్గొన్నారు. గురువులు ఆరా ఫౌండేషన్ యోగ మాస్టర్ కరిబండి రామకృష్ణ, పతంజలి యోగాలయం యోగ గురువు వింజమూరి మాధవరావు, సుభద్ర గుప్తా, అంబిక, తదితరులు యోగా చేయించారు.

ఆహార పదార్థాల పంపిణీ

పెనుగొండ: అక్షయ పాత్ర ఆధ్వర్యంలో గురువారం వడలి ఎన్టీఆర్ కూడలి వద్ద ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. పెనుగొండలో ఓ కార్యక్రమంలో మిగిలిన ఆహార పదార్థాలను వడలి అక్షయ పాత్ర సభ్యులకు అందించడంతో వాటిని పేదలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అక్షయ పాత్ర సభ్యులు ఉప్పలపాటి చంటి, మేకా సురేష్, అంగర వర ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అండగా నిలవడం అభినందనీయం



తణుకులో జెడ్పీ మహిళా హైస్కూల్ విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న సీఐ కొండయ్య, చిత్రంలో హెచ్‌ఎం పద్మావతి



వీరంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెరిట్ విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరచిన విద్యార్థులకు ప్రాఫిట్ షా కంపెనీ యాజమాన్యం చేయూతనివ్వడం అభినందనీయమని తణుకు పట్టణ సీఐ ఎస్.కొండయ్య అన్నారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తణుకు ప్రాఫిట్ షా కంపెనీలో గురువారం సీఐ చేతులమీదుగా సత్కారం, బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది పరీక్షా ఫలితాల్లో తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్ విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా 587 మార్కులు సాధించడం మంచి పరిణామమని అన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ బాయ్స్ హైస్కూలు విద్యార్థినులు పడాల కావ్యశ్రీ, కె.తన్మయి ప్రియలతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.పద్మావతిని ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులకు జ్ఞాపిక, సర్టిఫికెట్, కళాశాల బ్యాగ్, షూస్, విజేత ఆత్మకథ పుస్తకం, నోట్ బుక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాఫిట్ షా కంపెనీ బ్రాంచ్ మేనేజరు పాల లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

తాడేపల్లిగూడెం రూరల్: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన మండలంలోని వీరంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రెడ్డి నవ్యకు రూ.10వేలు ప్రోత్సాహక బహుమతిని గురువారం దాత కేతిరెడ్డి సుబ్బారెడ్డి అందజేశారు. అలాగే, 500లకు పైబడి మార్కులు సాధించిన ఏడుగురికి రూ.5వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కేతిరెడ్డి మాధవి మాట్లాడుతూ విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని, ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్నారు. అనంతరం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా చిన్నారులతో యోగాసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్‌నాగరాజు, ప్రధానోపాధ్యాయులు బి.సుకుమార్, కేతిరెడ్డి రాంబాబు, రామిరెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు ఇవ్వాలి

ఆకివీడు: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకురాలు మార్తమ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఏ సంక్షేమ పథకం అమలు చేయడంలేదని, తల్లికి వందనం కూడా తమకు అమలుజేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. పింఛన్ల సదుపాయం కూడా తమకు కల్పించడంలేదని వాపోయారు. ప్రభుత్వ ఉద్యోగ పేరుతో పథకాలు నిలుపుదల చేశారని, కుటుంబంలోని ఎవరికీ పథకం వర్తింపజేయలేదని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వర్కర్లకు, హెల్పర్లకు ప్రభుత్వ పథకాలు అమలుజేసే విధంగా జీఓ జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. సూపర్‌వైజర్ రత్నకుమారికి వినతి పత్రం అందజేశారు.